క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


కుమారస్వామి ఫైల్

ఎల్కతుర్తి: ఇటీవలే జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ విషాద సంఘటన మండలంలోని వల్భాపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, ఎస్సై గోదారి రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం. మండలంలోని వల్భాపూర్ గ్రామానికి చెందిన అంబాల కుమారస్వామి(55) ఈనెల 2వ తేదీన ఎల్కతుర్తి నుంచి స్వగ్రామమైన వల్భాపూర్‌కు వెళుతున్న క్రమంలో హుజూరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన కుమారస్వామిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వారు తెలిపారు.

చినజీయర్‌స్వామి జన్మదినం



ఆత్మకూరు: మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో వికాసతరంగిణి ఆధ్వర్యంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి ప్రత్యేక పూజలు, విష్ణుసహస్రనామపారాయణం చేశారు. కార్యక్రమంలో వికాసతరంగిణి అధ్యక్షుడు టింగిలికారి సత్యనారాయణ, ఐఅండ్‌పీఆర్ కోఆర్డినేటర్ పోలు రాజేష్‌కుమార్, కోశాధికారి నాగబండి శివప్రసాద్, పరికిరాల వాసు, మునుకుంట్ల సతీష్, పాపని రవీందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చల్లా పరామర్శ

నడికూడ: స్థానిక సర్పంచ్ ఊర రవీందర్‌రావు సతీమణి ఊర నిర్మల అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కి తరలించాలని తెలుపగా యశోద ఆస్పత్రి వారితో మాట్లాడి పంపించారు. కొక్కిరాల మురళి, ఊర శ్రీనివాస్‌రావు, సుజిత్‌రావు, పున్నం తదితరులు ఉన్నారు.

లఘుచిత్రం రిలీజ్



శాయంపేట : గ్రామానికి చెందిన గాజుల రామకృష్ణ రూపొందించిన లఘు చిత్రాలను స్థానిక సర్పంచ్ రవి సోమవారం జీజీఎల్ యూట్యూబ్ చానల్‌లో విడుదల చేశారు. సమాజంలో నెలకొన్న సమస్యలను చిత్రీకరించిన లఘు చిత్ర దర్శకుడు గాజుల రామకృష్ణ ఆలోచన అద్భుతమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, రమేష్, వెంకటరమణ, రవీందర్, నర్సయ్య, సాంబయ్య, స్వామి, అశోక్, రామకృష్ణ, రాజు, సాదిక్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

కాశిబుగ్గ: పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన నెక్కొండ – ఎల్గూరు రైల్వే స్టేషన్ల మధ్య సోమవారం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గేటుపల్లి తండాకు చెందిన బాదావత్ కిరసింగ్ (43) మానసిక స్థితి సరిగాలేక 10ఏళ్ల క్రితం ఆర్మీలో ఉద్యోగం , భార్య పిల్లలను వదిలేసి నెక్కొండలో ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం రైలు పట్టాలు దాటుతుండగా మూడవ లైన్‌లో గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో తలపగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కిరసింగ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృతుడి బంధువులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి..

కాశిబుగ్గ: రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడి ఓ గుర్తు తెలియని యువకుడు దుర్మరణం చెందిన ఘటన నెక్కొండ – ఎల్గూరు రైల్వే స్టేషన్ల మధ్య గేటుపల్లి రైల్వేగేట్ సమీపంలో సోమవారం జరిగింది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం 25 – 30 ఏళ్ల వయస్సు గల యువకుడి మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు సీఐ తెలిపారు. మృతుడి వివరాలకు వరంగల్ జీఆర్పీ స్టేషన్‌లో, 87126 58585 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

డీసీఎం వ్యాన్ ఢీకొని..

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని హంటర్‌రోడ్డు నీలిమా జంక్షన్‌లో సోమవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని డీసీఎం వ్యాన్ ఢీకొట్టడంతో ఓ యువకుడు దుర్మరణం చెందినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం, గున్నెపల్లికి చెందిన చిల్లా సిద్ధార్థ (21) విశాల్‌మార్ట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేసి విధులు ముగించుకొని అదాలత్ వైపు వస్తుండగా విష్ణుప్రియ గార్డెన్‌కు వైపు వెళుతున్న డీసీఎం వ్యాన్ అతన్ని ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ బైక్‌పై ఉన్న మరో ఇద్దరు గుగులోతు పవన్, ప్రమోద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఇంటింటా దీపావళి సంబురాలు

- కేదారేశ్వరస్వామిని నోముకున్న ప్రజలు
- చిచ్చుబుడ్డిలతో వెలుగుల పండుగ
- చేపలకు భలే గిరాకీ


ఆత్మకూరు : బాణసంచా కాలుస్తున్న చిన్నారులు

ఎల్కతుర్తి: వెలుగుల పండుగ దీపావళిని పురస్కరించుకొని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల ప్రజలు దీపావళి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. పిల్లలు, పెద్దలు నూతన వస్త్రాలు ధరించి సమీప ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ ఇళ్లలో సిరులు విరజిల్లాలని కోరుకుంటూ లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నోములున్నవారు కేదారేశ్వరస్వామిని తలుస్తూ నోముకున్నారు. అనంతరం బాణసంచాలు కాల్చి దీపావళిని అంగరంగా వైభవంగా జరుపుకున్నారు. ప్రధాన కూడళ్లోని ఇళ్ల ప్రాంగణాలు విద్యుత్ కాంతులు, చిచ్చుబుడ్డిల వెలుగులతో విరజిమ్మాయి.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం దీపావళి వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రజలు కేదారేశ్వరస్వామి వ్రతాలు చేపట్టారు. బాణసంచాలు కాల్చి దీపాలు వెలిగించి సంబురాలు చేసుకున్నారు.

కమలాపూర్: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో దీపావళి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. దీపావళి పర్వదినం సందర్భంగా రంగురంగుల పూలతో పాలవెల్లిని అలంకరించి భక్తి ప్రపత్తులతో కేదారేశ్వరస్వామిని నోముకున్నారు. అనంతరం చిన్నా, పెద్ద, మహిళలు అనే తారతమ్యం లేకుండా టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.


ఎల్కతుర్తి : వెలుగులు విరజిమ్ముతున్న చిచ్చుబుడ్డి


కమలాపూర్ : క్రాకర్స్ కాలుస్తూ..

బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

చేపలకు భలే గిరాకీ..

'గౌరమ్మను కొలిచాక గంగమ్మను తినాలి' అనేది అనాధిగా వస్తున్న సాంప్రదాయం. దీంతో దీపావళి మరుసటి రోజు ప్రజలు చేపల కొనేందుకు బారులుదీరారు. దీంతో చేపలకు గిరాకీ బాగా పెరిగింది. అధునుగా భావించిన కొందరు చేపల విక్రయదారులు మండల కేంద్రంలో రెట్టింపు ధరలతో విక్రయించారు. అయినప్పటికీ ప్రజలు అధిక ధరలు చెల్లించి మరీ కొనుగోలు చేశారు.

పరకాల: పట్టణంలో దీపావళిని ఘనంగా నిర్వహించారు. ఇంటిముందు రంగురంగుల ముగ్గులు వేసి దీపాలు వెలిగించారు. కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాల్చి ఆనందంగా గడిపారు. కేదారేశ్వర వ్రతాలు చేపట్టి నోములు నోముకొని భక్తిశ్రద్ధలను చాటుకున్నారు.

ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధం


మంటలను ఆర్పివేస్తున్న ఫైర్ సిబ్బంది

శాయంపేట : మండలంలోని పత్తిపాకకు చెందిన పున్నం కర్ణాకర్ గడ్డివాము ప్రమాదవశాత్తు నిప్పు అంటుకొని దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం. కర్ణాకర్ తనకున్న రెండు ఎకరాల భూమిలో వరి పంట సాగు చేసిన వరిగడ్డితో పాటు మరికొంత కొనుగోలు చేసి ఇంటి ఆవరణలో ఉంచాడు. సోమవారం దీపావళి పండుగకు మాదన్నపేటకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వరిగడ్డికి నిప్పు అంటుకొని కాలుతుండగా గొర్రెల కాపర్లు గమనించి పక్కింటి వారికి సమాచారం ఇచ్చారు. దీంతో స్థానికులు మోటర్ల నీటిసాయంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ మంటలు అదుపులోకి రాకపోవడడంతో పరకాల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో 25వేల గడ్డి దగ్ధమైందని బాధితుడు వాపోయాడు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం


మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

దామెర: మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు సోమవారం పాలాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించేందుకు ప్రధాని నరేంద్రమోదీ సుముఖత చూపడం హర్షించదగిన విషయమన్నారు.

చేతులు కలిపారు.. చేయూతనిచ్చారు

- బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన స్నేహితులు


కమలాపూర్ : ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందజేస్తున్న మెకానిక్‌లు


శాయంపేట : ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్‌ను అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

కమలాపూర్: ప్రమదవశాత్తు జరిగిన వివిధ ప్రమాదాల్లో మృతి చెందిన స్నేహితుల కుటుంబాలకు తోటి స్నేహితులు అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన బూర వెంకటరమణ ఇటీవలే జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతని కుటుంబానికి తోటి బైక్‌మెకానిక్‌లు చేయూతనిచ్చారు. తలోకొంత పోగుచేసి యూనియన్ ఆధ్వర్యంలో వెంకటరమణ కూతురు పేరిట పోస్టాఫీస్‌లో రూ. 25వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బైక్ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు భాస్కర్, యూనియన్ నాయకులు శంకర్, రాజేందర్, రాజు, అశోక్, సాయి, శ్రీను, కోటి, సురేష్, తిరుపతి, బైక్ మెకానిక్‌లు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన ఎల్లబోయిన సుమన్ గత నెల 7వ తేదీన మృతి చెందాడు. 2005–06 సంవత్సరంలో అతనితో పాటు 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు బాధిత స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచారు. తలోకొంత పోగుచేసిన రూ. 50వేల నగదును అతని కూతురు పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్‌ను అందించారు. అలాగే 25కిలోల బియ్యాన్ని అందించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల, రవీంద్ర భారతి పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశమివ్వండి..


ముల్కలపల్లిలో ప్రచారం చేస్తున్న కీర్తిరెడ్డి



శాయంపేట: సమావేశంలో మాట్లాడుతున్న కీర్తిరెడ్డి

- బీజేపీ భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి

మొగుళ్లపల్లి: ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశమివ్వండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముల్కలపల్లి, కొర్కిశాల, పోతుగల్లు గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు తరలివచ్చి కీర్తిరెడ్డికి మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీలు మారే నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని, ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం కొనసాగించారు. శేషగిరి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చదువు రామచంద్రారెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్‌రెడ్డి, మండల సోషల్ మీడియా కన్వీనర్ సురేష్ పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: పట్టణంలోని సీఆర్‌నగర్‌లో బీజేపీ అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటేసి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కీర్తిరెడ్డిని గెలిపించాలని కోరారు.

బీజేపీతోనే సామాజిక న్యాయం

రేగొండ: సామాజిక న్యాయమే లక్ష్యంగా పనిచేస్తున్న బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు దాసరి తిరుపతిరెడ్డి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నేతలు విలువలు లేని రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు వెన్నంపల్లి పాపయ్య, నిశీధర్ రెడ్డి, లింగంపల్లి ప్రసాదరావు, తిరుపతిరావు, మనోహర్, అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

శాయంపేట: ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గండ్ర సత్యనారాయణరావులు కేవలం పదవుల కోసమే పాకులాడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. బీజేపీ అన్ని వర్గాల అభివృద్ధి కోసం కష్టపడి పని చేస్తుందని, బీసీ, ఎస్సీ వర్గీకరణ నినాదాలతో ముందుకు సాగుతుందన్నారు. శాయంపేట మండలానికి ఆర్టీసీ బస్సు, 108అంబులెన్స్ సౌకర్యాన్ని, పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేస్తామని, అర్హులకు తెల్లరేషన్ కార్డులు, పింఛన్లు అందిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మైలారం గ్రామానికి చెందిన సిరిపురం కొమురయ్య, మోతే విక్రంతో పాటు 20మంది బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌లో చేరికలు


నడికూడ : కాంగ్రెస్‌లో చేరుతున్న గ్రామస్తులు

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన పలువురు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి టీపీసీసీ సభ్యుడు, భూపాలపల్లి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు కండువా కప్పి ఆహ్వానించారు. గ్రామ ఉపసర్పంచ్ మోరే శ్రీనివాస్‌తో పాటు మరో 20 మంది చేరారు. మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నడికూడ: మండలంలోని చర్లపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, వార్డు సభ్యులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి రేవూరి ప్రకాష్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక


కమలాపూర్ : కండువా కప్పుతున్న కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: మండలంలోని ఉప్పల్‌కు చెందిన సుమారు వంద మంది ముదిరాజ్ కులస్తులు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జ్ ఇనుగాల పెద్దిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.

ఎల్కతుర్తి: మండలంలోని దండేపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ కండువా కప్పి ఆహ్వానించారు. ఎంపీపీ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన టీడీపీ నాయకులు సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు.

సిద్దాపురంలో గొర్రెల కొట్టం దగ్ధం



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సిద్దాపురం గ్రామంలో ఓ గొర్రెల కొట్టం దగ్ధమైంది. సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘటనలో 50 గొర్రెలు సురక్షితంగా బయటపడ్డాయి. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. సిద్దాపురం గ్రామానికి చెందిన ముస్కు గోపాల్‌కు 50 గొర్రెలు ఉన్నాయి. గొర్రెలను ఆదివారం మేతకు తీసుకెళ్లి సాయంత్రం తిరిగి ఇంటి వద్ద కొట్టంలో ఉంచాడు. కొట్టం నుంచి అర్ధరాత్రి పొగలు వ్యాపించడంతో చుట్టుపక్కల వారు గమనించి గోపాల్ సమాచారం అందించారు. దాంతో గొర్రెలను కుటుంబ సభ్యులు బయటికి పంపించారు. గుర్తు తెలియని వ్యక్తులు కొట్టానికి నిప్పు పెట్టారని బాధితుడు అనుమానం వ్యక్తం చేశాడు. సంఘటనా స్థలానికి పోలీస్ ఇన్‌స్పెక్టర్ గోపి, ఎస్సై సురేష్ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


ఓటర్లను ప్రలోభాలకు గురిచేయొద్దు



మాట్లాడుతున్న మొగిలిచెర్ల సుదర్శన్

ఖిలా వరంగల్: ప్రజాస్వామ్యయుతంగా జరగనున్న ఎన్నికల్లో ఓటర్లను నాయకులు ప్రలోభాలకు గురిచేసి, ప్రజాధనం దుర్వినియోగం చేయొద్దని కన్జ్యూమర్ కన్‌ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ సూచించారు. వరంగల్ శివనగర్‌లోని సమాఖ్య జిల్లా కార్యాలయంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది మురారిశెట్టి యశ్వంత్‌కుమార్ అధ్యక్షతన ఓటు వినియోగం – చైతన్యంపై న్యాయ సలహాదారుల సమావేశం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా సుదర్శన్ మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం –2005 ప్రకారం నాలుగేళ్లుగా ప్రభుత్వ శాఖల నుంచి పలు అంశాలను సేకరించినట్లు తెలిపారు. ప్రజాధనం దుర్వినియోగం, అభివృద్ధి మాటున జరిగిన అక్రమాలు, ధరణి పోర్టల్ దుర్వినియోగంతోపాటు చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమణకు గురైనట్లు గుర్తించామని వివరించారు. నియంత్రణ లేని ధరల పెరుగుదల, మితిమీరిన కల్తీ, మద్యం విక్రయాలు సామాన్య ప్రజలకు ఆర్థికంగా, ఆరోగ్యంగా నష్టం కలిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా చైతన్య కార్యక్రమాలపై ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 3,200 మంది వలంటీర్లను నియమించి ఓటరు చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో న్యాయవాదులు రంగరాజు, ఆనందరావు, రాయబారపు భిక్షపతి, బండి అనిల్‌కుమార్, జంపాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా కాళోజీ జయంతి



జయంతిలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

పరకాల: ప్రజాకవి కాళోజీ జయంతిని పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి, బీఆర్ఎస్ సమన్వయ సమితి నాయకులు చందుపట్ల రమణారెడ్డి, దగ్గు విజేందర్‌రావు, సోదా రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు మెగా డయాబెటిస్ శిబిరం

నయీంనగర్: నవంబర్ 14న ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ డయాబెటిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గోపాల్‌పూర్ చౌరస్తా, ఎర్రగట్టు గుట్ట, వడ్డేపల్లి చర్చి కాంపౌండ్, కేయూ క్రాస్ జంక్షన్, ఎంజీఎం జంక్షన్లలో మంగళవారం మెగా డయాబెటిస్ స్క్రీనింగ్, అవగాహన శిబిరాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

హన్మకొండ: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ అందించిన ఓటు హక్కును ప్రతి ఓటరూ సద్వినియోగం చేసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. హనుమకొండలో దళిత బహుజన ఫ్రంట్ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును దుర్వినియోగం చేయొద్దని, అవినీతిని అంతమొందించే దిశగా ఓటర్లు అడుగులు వేయాలని చెప్పారు. రాష్ట్రంలో దళితులపై కొనసాగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సూచించారు. రాజ్యాంగంలో కల్పించిన హక్కులు, అవకాశాలను భిక్షగా కాకుండా హక్కుగా అమలు చేయాలన్నారు. సమావేశంలో దళిత బహుజన ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, కార్యదర్శి చుంచు నరేష్, జిల్లా నాయకులు శ్రీనివాస్, సాంబయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులను పట్టించుకోని ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న వీరన్న నాయక్

నయీంనగర్: గిరిజనులకు ప్రత్యేక గిరిజన కమిషన్, గిరిజన బంధు, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులకు అన్యాయం చేసిందని కాంగ్రెస్ పార్టీ ట్రైబల్ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు ప్రొఫెసర్ వీరన్న నాయక్ విమర్శించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రూ.16 వేల కోట్లకు పైగా మిగులు బడ్జెట్‌తో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం.. నేడు 5లక్షల కోట్లకు పైగా అప్పులతో తెలంగాణను ఊబిలోకి నెట్టిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలో విద్యా, వైద్యం నిర్లక్ష్యానికి గురైనట్లు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను గాలికి వదిలేశారని వాపోయారు. గిరిజన రిజర్వేషన్ పెంచుతామని హామీ ఇచ్చి మోసం చేసిన బీఆర్ఎస్‌కు గిరిజనులు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

పరకాలలో కారు దహనం



పరకాల: పట్టణంలోని సీఎస్ఐ కాలనీలో పట్టపగలే ఓ ఇంటి ఎదుట నిలిపిన కారు దహనం కావడంతో కాలనీవాసులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు గమనించి బకెట్లతో నీళ్లుపోసి మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. ఎవరైనా దీపావళి బాణసంచా కాల్చుతున్న సమయంలో నిప్పురవ్వలు పడి దహనమైనట్లు మొదట కాలనీవాసులు అనుమానిస్తుండగా కారు యజమాని మడికొండ లడ్డు మాత్రం గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే తన కారుపై డీజిల్ పోసి నిప్పంటించినట్లు అనుమానం వ్యక్తం చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.